

వర్షించిన చిరుమేఘం
'వింధ్యవాసిని'
CHANDRA




య్యాక కోపం వస్తుందని కాస్సేపు నిశ్శబ్దంగా నిలుచున్నాడు. రవి వంతు అయి, మరొకళ్ల అబ్బాయి చేతికి వచ్చింది బాటు. ఇదే అదనని ఒక్క గెంతులో అన్న దగ్గిర చేరి "నేనూ ఉంటా ఆటలో. నన్ను ఆడనివ్వవూ?" అని గునిశాడు. వీడి మాటలకి రవి స్నేహితులంతా పకపకా నవ్వారు, ఏదో జోక్ విన్న వారిలా. ఉతికి ఆరేసిన ఇస్త్రీ లేని చారల చొక్కా, ఎంత లాక్కున్నా నిలవకుండా జారిపోతున్న ఎలాస్టిక్ పోయిన నిక్కరూ, తోడుగా టామీతో నిలుచుని ఉన్న శశిని బఫూన్‌లా చూశారు అంతా.

"పోరా లోపలికి నీ మొహం! నువ్వేం ఆడతావు" అని కసిరేసి బాల్ పుచ్చుకుని బవులింగ్‌కి తయారు అయాడు రవి.

"పోనీ ఫీల్డింగ్ చేస్తాలే" అని బ్రతిమాలబోయాడు శశి. వీడి 'ఫీల్డింగ్'కి మళ్ళీ అంతా నవ్వులతో విరిగిపోయింది.

"వద్దురా. నువ్వెళ్ళు ఆవతలికి. ఆటలో నీకు బాల్ ఎక్కడయినా తగిలిందంటే మళ్ళీ అమ్మతో నాకు చీవాట్లు" అని మెడమీద చెయివేసి తమ్ముణ్ణి తోసినంత పని చేశాడు రవి.

అన్నయ్య తోయటం, వాళ్ళందరి నవ్వులతో అవమానంగా ఉంది శశికి. ముఖం గంటు పెట్టుకుని లోపలికి నడిచాడు. 'అమ్మకు చెప్పి వీడి పని పట్టించాలి' అనుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు. నాన్నగారి ఆఫీస్ గదిలో అమ్మ, నాన్న ఏదో గొడవ పడుతున్నారు. అసలు అమ్మ, నాన్న ఎందుకు పోట్లాడుకుంటారో శశికి అర్థం కాదు. వాడికి తెలిసిందల్లా ఒక్కటే, అంతా అయాక అమ్మ కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ బయటికొచ్చి, వంట గదిలో మౌనంగా పని చేసుకుంటూ ఉండిపోవటం మాత్రమే. ఇలాంటప్పుడు ఎవరేమని పలకరించినా, వాళ్ళకి తిట్లు తప్పవు.

సమయం సరికాదని మేడమీద చిన్నక్క సుమ గదిలోకి వెళ్ళాడు. సుమ ఇంట్లో ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడదు. సెలవు వస్తే రోజంతా తన గదిలో కూర్చునే గడిపేస్తుంది, ఏదయినా చదువుతూనో, రాస్తూనో. ఇవేళ టేబిల్ మీద పెద్ద డ్రాయింగ్ షీటొకటి పరిచి ఏదో బొమ్మ గీస్తోంది.

మెల్లిగా శబ్దం కాకుండా లోపలికి వెళ్ళి "అక్కా, ఏం చేస్తున్నావూ?" అని అడిగాడు శశి.

సుమ మూడ్ బాగానే ఉన్నట్లుంది. "ఏమిట్రా, శశీ, ఏం కావాలి?" అని అడిగింది చేతులు చాచి దగ్గరికి రమ్మని పిలుస్తూ. "మరేమో బోర్ కొడుతోందక్కా. ఏదయినా కథ చెప్పవూ?"

"కథలేమిట్రా ముసలమ్మలాగా. బయట రవి ఆడుకుంటున్నాడుగా—వెళ్ళి ఆడుకోరాదూ?"

"ఊహుఁ అన్నయ్య నన్ను వద్దు పొమ్మన్నాడు."

"అలాగా. అయితే ఉండు. ఈ కాస్త డ్రాయింగ్ వేసేసి వస్తాను. అంతవరకూ నువ్వీ పుస్తకంలో బొమ్మలు చూస్తూ ఉండు" అంటూ అటు తిరిగింది.

సరిగ్గా అదే సమయంలో లోపలి కొచ్చిన టామీ టేబిల్ మీదికి గెంతడమూ, ఆ దెబ్బతో అక్కడున్న ఇండియన్ ఇంక్ సీసా దొర్లి ఇంక్ అంతా షీట్ మీద పరుచుకోవడం ఒకేసారి జరిగాయి. అంతే. కోపంతో వూగిపోతూ స్కేలు పుచ్చుకుని టామీ వెంటపడింది సుమ. అదెలాగూ దొరకదు. కాస్సేపయాక తిరిగొస్తే, అక్క కోపం అంతా తన మీదికే వస్తుంది. 'టామీ' తన కుక్కే గదా! అందుకని...

గమ్మున చేతిలో పుస్తకాన్ని అవతల పడేసి తుర్రుమన్నాడు శశిధర్, సుమ తిరిగి వచ్చేసరికి.

మధ్యాహ్నం భోజనం చేసి, అమ్మ పక్కన పడుకుని కాస్సేపు నిద్రపోయాడు. శశికి మెలకువ అయేసరికి అమ్మ ఇంకా నిద్రపోతూనే ఉంది. పక్కనేకింద పడుకుని ఉన్న టామీ సిరా మరకలతో అసహ్యంగా కనిపించింది. 'దీనికి స్నానం చేయిద్దాం' అని బయలుదేరాడు. అరగంట సేపు సగం లక్స్ సబ్బు అరిగే దాకా దానికి శుద్ధి స్నానం చేయించాడు. టామీ అయితే శుభ్రంగా నిగనిగలాడుతూ తయారయింది కానీ దాని స్నానం అయే సరికి దాని అల్లరి భరించి, దాని వెంట తోటలో, మట్టిలో పరుగెత్తి, గెంతి శశి బట్టలన్నీ తడి, మురికి అయాయి. అమ్మ లేచి నాలుగు అంటించిన తరవాత గానీ ముఖం కడిగి వేరే బట్టలు వెయ్యదు. అసలు తను టామీకి స్నానం చేయించటమే ఆవిడకి నచ్చదు. శీతాలుతో చేయిస్తానంటుంది.

ఇల్లంతా నిశ్శబ్దంగా నిద్ర పోతున్నట్లుగా ఉంది. ఏమీ తోచక కాస్సేపు కాలు గాలిన పిల్లిలా తిరిగాడు శశి. అప్పుడు వాడి కో చిత్రమయిన అయిడియా వచ్చింది. ఇంట్లో తనంటూ ఉన్నాడని గుర్తించి, తనని పలకరించే వాళ్ళే లేరు. వీళ్ళందరికీ కనిపించకుండా తను కాస్సేపు ఎక్కడయినా దాక్కుంటే ఏమవుతుంది? తన కోసం వెతుకుతారు. దొరక్కపోతే గాభరా పడతారు గావును.

బాగానే ఉంది ప్లాను. ఎక్కడ దాక్కోవాలి? అని స్థలం కోసం వెతుక్కుంటూ ఇంటి చుట్టూ ఒక ప్రదక్షిణం చేశాడు.

కాంపౌండ్‌లో గారేజీలు రెండు ఉన్నాయి. ఒక దానిలో శశి నాన్నగారు మామూలుగా ఉపయోగించే కారు ఉంటుంది. మరొకటి పాతదై సున్నం పెచ్చులు రాలే గోడలతో ఉంటుంది. ఇందులో ఎప్పుడూ పాతదై మూలకు పడ్డ డొక్కు జీపొకటి ఉంటుంది. దీనికి తాళం కూడా వేయరు.

శశి ఈ గారేజీ తలుపులు మెల్లిగా తోసి లోపలికి వెళ్ళాడు. అవతల దాని కున్న ఒకే కిటికీ దగ్గర దట్టంగా ఏవో పొదలు పెరిగాయి కాబోలు లోపల అంతా చీకటిగా ఉంది.

కిర్రుమని పెద్దగా శబ్దం చేసే తలుపుని మెల్లిగా దగ్గర కేసి జీపు దగ్గరికి నడిచాడు శశి. తలుపు సందుల్లోంచి కొద్దిగా మాత్రం వెలుతురువస్తోంది. ఎలాగో కష్టపడి జీపులో ఎక్కి డ్రైవింగ్ సీట్‌లో కూచున్నాడు. సీటు అంతా చినిగిపోయి లోపలి స్ప్రింగ్‌లు పొడుచుకొచ్చి గుచ్చుకుంటున్నాయి. అయినా బాధగా లేదు శశికి. ఏదో పెద్ద అడ్వెంచర్ చేస్తున్న వాడిలా ఉంది వాడి మొహం, అందులో కనిపిస్తున్న ఉత్సాహం.

కాస్సేపు స్టీరింగ్‌నీ, దాని చుట్టూ ఉన్న బటన్లనీ, వూడిపోయిన వైర్లనీ, ఒరిగిపోయి విరిగేలా గేర్ కడ్డీనీ పరీక్షిస్తూ కూర్చున్నాడు. కాస్సేపటికి దాని వైనం అంతా తెలిసిపోయిన వాడిలా డ్రైవింగ్ చేయటం మొదలుపెట్టాడు. అచ్చం నాన్నగారు తిప్పి నట్లే తాళం చెవులు వూహించుకుని తిప్పేసి. రెండు చేతులతో స్టీరింగ్ పట్టుకుని, కళ్ళు మూసుకుని జీపు ముందుకు పరుగెత్తి, గాల్లో పైకి లేచినట్లుగా వూహించుకున్నాడు. ఏదో సినిమాలో హీరో ఎక్కిన కారు అలా గాలిలో ఆకాశంలో ఎగురుతూ వెళ్ళిన గుర్తు. అలాగన్నమాట ఇప్పుడు శశి చేస్తున్నది.

అట్లా ఎన్ని మైళ్ళు డ్రైవ్ చేశాడో ఏమో, విసుగు పుట్టి కళ్ళు తెరిచి చూస్తే, అంతటా చీకటి దట్టంగా అలుముకుని ఉంది. తలుపులు గానీ, వాటి సందుల్లోంచి వస్తున్న వెలుగు గానీ ఏమీ కనిపించటం లేదు.

భయం వేసింది శశికి. ఎప్పుడో సీతాలు చెప్పిన చీకట్లో దయ్యాలకథ గుర్తొచ్చింది. "అమ్మయెగ్యా" అనుకుని జీపు దిగి, ఒక్క పరుగున గారేజీ దాటి

బయటపడ్డాడు. బయట కూడా చీకటిగానే ఉంది. "అరే, ఎంతసేపయిందో? ఎవ్వరూ నా కోసం వెతకలేదేమిటి? ఏం చేస్తున్నారో అంతా" అనుకుంటూ మెల్లిగా పిల్లిలా అడుగులు వేస్తూ లోపలికి వెళ్ళాడు.

లైట్లన్నీ ఆర్పేసి అందరూ హాల్లో కూర్చుని టీ. వీ. చూస్తున్నారు. సినిమా మంచి రసకందాయంలో ఉందేమో వచ్చి ద్వారంలో నిలుచున్న శశిధర్ని ఎవ్వరూ గమనించలేదు.

ఆ చీకట్లో అమ్మ ఎక్కడుందో అర్థం కాలేదు. అందుకనే "అమ్మా" అని పిలిచాడు. జవాబు రాకపోతే మళ్ళీ మళ్ళీ "అమ్మా—అమ్మా" అని కేక వేస్తూ సోఫాల్లో వెతికాడు, కళ్ళు చికిలించి చూస్తూ.

పెద్ద అక్క కాబోలు అన్నది—"అమ్మ, నాన్న సినిమాకి వెళ్ళారు గానీ. నువ్విట్లా వచ్చి సైలెంట్‌గా కూర్చుని చూడు. గోల చెయ్యొద్దు." అని.

అంతే. 'అయితే వీళ్ళ కెవ్వరికీ నేను కనిపించకుండా దాక్కున్న విషయమే తెలీదన్న మాట! ఛ!' అనుకున్నాడు. తనకి సినిమాలు అర్థం కావు. అమ్మ దగ్గరుంటే కొంచెం కొంచెం అర్థం అయేలా చెబుతుంది. అవిడేమో ఇవాళ తన్ని పట్టించుకోకుండా నాన్న వెంట వెళ్ళిపోయింది.

అసలు అమ్మ, నాన్న ముందంతా తన్ని వెంట తీసుకెళ్ళేవాళ్ళు. ఆ మధ్య ఒకసారి, దార్లో ఎవరో కనిపించి 'ఈ అబ్బాయి మీ మనవడా?'' అని అడిగారు తన్ని చూపించి. ఆ వేళ నాన్నగారి కెంత కోపం వచ్చిందీ తనకి బాగా గుర్తు.

అంతే! ఆ వేళ నించీ వాళ్ళిద్దరూ తన్ని ఎక్కడికీ తీసుకెళ్ళరు. ఇందులో తన తప్పేమిటో అర్థం కాదు శశికి.

ఆఖరికి అమ్మ కూడా తనని ఏమయ్యాడో అని వెతక్కుండా వెళ్ళిపోయిందని అర్థం అయేసరికి ఏడుపొచ్చేసింది శశికి. అందరి ముందరా ఏడవటం ఇష్టం లేదు.

లోపలికి వెళ్ళిపోయాడు. మంచం మీద దిండులో తల దూర్చి ఏడుస్తూ పడుకున్నాడు. అట్లా ఎంతసేపు ఏడ్చాడో, కళ్ళ నీళ్ళు ఇంకిపోయేదాకా. భుజం నొక్కినట్టయి దిండులోంచి తలెత్తి చూశాడు. పక్కనే రెండు కాళ్ళతో మంచం ఎక్కి నిలుచుని తన వైపే చూస్తున్న టామీ కనిపించింది. "ఇదొక్కటే నా నేస్తం" అని దాన్ని పక్కలోకి లాక్కుని పడుకుంటే కొద్దిగా సాంత్వనగా అనిపించింది శశిధర్‌కి. దాని బొచ్చు నిమురుతూ, అమ్మ కోసం ఎదురు చూస్తూ పడుకున్న వాడికి ఆకలి కడుపుతోనే మాగన్నుగా నిద్రపట్టింది. ★

# ఊహాగానం

గోపాలుం డవతరించెనే
మరల భువిని
గోపాలుం డవతరించెనే
రూపాధిక సౌమ్యమూర్తి
దీపాయిత రమ్యకీర్తి
గోపాలుం డవతరించెనే....

ఇది కృష్ణభక్తితో కూచిపూడి భాగవతులు చేసే చెక్కభజన అనుకునేరు. ఒక కృతికర్త మహా కృతిభర్తను పొగుడుతూ రాసిన గీతమో, గేయమో మా కర్థం కావటంలేదు.

నా ఉద్దేశంలో ఈ అవతరించిన గోపాలుడు మా గోపాల రెడ్డిగారు. ఆయన డెబ్బై అయిదేళ్ళ సుదీర్ఘ జీవితంలో ఇలాంటి అవతారాలు ఎన్ని ఎత్తారో, ఎంతమంది కవులు ఈ విధంగా పొగిడారో ఆయనకే తెలియాలి తప్పితే ఆ గోపాలుడికి తెలియాలి.

కన్నెరాసిని జన్మించి కవులనెల్ల మోహవారాసి నాతడు ముంచి ఎత్తు అని మరొక కవి ప్రవాట్టూ, ఇంకా నాకు జ్ఞాపకం లేదు గాని మరో కవి గంధర్వరాజనీ, ఇంకొకాయన పరమ సుందరుడనీ ఆయన్ని పొగిడారు.

నాకు తెలిసినంతమటుకు గోపాలరెడ్డిగారికి పోట్లాడే వాళ్ళంటే ఉన్న ఇష్టం పొగిడేవాళ్ళంటే లేదు. గోపాలరెడ్డిగారు నాకు బుద్ధి తెలిసిన దగ్గరనుంచీ వృద్ధులే. స్వరమ సౌందర్యం అంతకు ముందు ఉండేమో నాకు తెలియదు ఈ కవు లన్నట్టు. సామాన్యంగా గంధర్వుడంటే పాట బాగా వచ్చినవాడని అర్థం. ఆయనకు లలిత కళలంటే ఇష్టమే గాని అవి వచ్చునని నేను అనుకోటంలేదు. కవిత్వం రాస్తారనుకోండి. అవన్నీ ఆమెకు సంబంధించినవే. ఇక్కడ ఆమె అంటే బ్రహ్మ పదార్థంలాగా మనకు అర్థం కానిదీ, ఆయనకు తెలియనిదీ అయిన వూహా సుందరి. అలా ఎందుకు అంటున్నానంటే డెబ్బై అయిదేళ్ళు వచ్చినాక ఆమెను గురించి ఆయన రాయటాన్నిబట్టి.

శ్రీ గోపాలరెడ్డిగారికి డెబ్బై అయిదు సంవత్సరాలు నిండి సాహిత్య అకాడెమీ అధ్యక్ష స్థానంనుంచి దిగిపోయినందుకు నేను వారిని గురించి పొగడడమో, విమర్శించడమో లోకు ఏమనుకున్నా సరే, నాకు తెలిసినవి వ్రాయదలుచుకున్నాను. సుమారు ఇరవై ఏళ్ళ పితృ పుత్రికా సంబంధం మాది. ఆయన ప్రెసిడెంటుగా, నేను మెంబరుగా ఎన్ని తడవలో విరోధించాం, విబేధించాం, సహకరించాం, సమ్మతించాం. ఇంతటి సుదీర్ఘమైన అనుబంధం మొన్న ఆగస్టుతో అయిపోయింది. చిత్రమేమిటంటే, ఆదివరకు ఎన్ని విబేధాలు ఉన్నా, ఎన్ని విహితాలున్నా ఆయన దిగిపోయిన అనంతరం ఆ లోటు ఒక విధంగా తీర్చలేనిది. సాహిత్య అకాడమీ కమిటీల్లో, సభల్లో ఆయన రాజకీయవేత్త. అసెంబ్లీలో, పార్లమెంటులో ఆయన సాహితీవేత్త. అందుకని ఆయన్ని సామాన్యంగా ఎవరూ మరిచిపోరు. మీటింగులో ఆయన ఓపిక చూస్తుంటే ఈయన శరీరానికి వార్ధక్యం వచ్చింది గాని మనసు ముసలిది కాలేదనిపిస్తుంది. కాని కాలం ఆయన ఒంటిమీద తన అడుగుల పచ్చబొట్లని పొడిచే పోయింది. మా గోపాలరెడ్డిగారు వృద్ధులైనారు. ఆయన మాటల్లో చెప్పాలంటే దృష్టి, వినికిడి, ఓపిక మొదలైనవన్నీ వెళ్ళిపోయినాయి. ఇహ నేనే వెళ్ళాలి అని. అది ఎవరికీ తప్పని సుదీర్ఘ ప్రయాణమే అయినా ఆయన అలా అంటుంటే నా కళ్ళలో నీళ్ళు తిరిగినాయి.

ఆయన 'మగదిక్కు' అనే నవలని కృతిగా స్వీకరించారు. ఇప్పుడా మగదిక్కు భగవంతుడు. పురుషు డాత డొకండె పొలతులము మనమంతా అన్న ప్రకారం గోపాలరెడ్డిగారికి మగ దిక్కు సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మ. ఆడదిక్కు ఆమె. ఆమె ఎవరో ఇందాకే చెప్పాను. ఆమె బ్రహ్మ పదార్థమే కాదంటే భారతీబ్రహ్మ. ఇది మోడరన్ పేరు. మొగుడు పేరు చివర తగిలించుకోదలుచుకుంటే ఆ భారతి బ్రహ్మ పేరు తగిలించుకుంటే భారతీ బ్రహ్మ అవక తప్పదు.

శ్రీ గోపాలరెడ్డిగారు వివాహానికి పూర్వమే సంయుక్త మద్రాసు రాష్ట్రంలో మంత్రియై తెలుగువాళ్ళమీద సదభిప్రాయం ఏర్పరుచుకోలేదు. ఇది నాకు తెలియదు గాని కే. శే. ఎన్. వి. బి. చౌదరిగారి ఆత్మకథలో ఉంది ఈ విషయం. ఆయన ఉపన్యాసాలు అనేకం విన్నమీదట కవుల రచనలకంటే కవుల సరిచయాలే ఆయనకు అధికం అనిపిస్తుంది. తనకంటే అన్ని విధాలా తక్కువైన వాళ్ళతో ఆయన సమానంగా మాట్లాడటం ఆయన మానవత్వానికి నిదర్శనం అనుకోవాలో, లేక రాజకీయం అనుకోవాలో నాకు ఇప్పటికి బోధపడలేదు. ఏది ఏమైనా, ఆయన ఇరవై అయిదేళ్ళనుంచి ఆంధ్ర సాహిత్య పీఠాధ్యక్షుడై ఉండటం ఆయన పూర్వజన్మ సుకృతం. మహాకవి అయినవాడు కూడా ఇన్నాళ్ళు ఉండలేడు, పొలిటీషియన్ తప్ప. ఆ పొలిటీషియన్ తనం మా గోపాలరెడ్డిగారికి సాహిత్యంలో సమృద్ధిగా ఉంది. ఇకనుంచి ప్రతి నెలా నెల్లూరు వెళ్ళి చూడకపోతే కవులకూ, రచయితలకూ తోచదు. ఫెలో కూడా అయిపోయింది. లేకపోతే ఆయనను చూడటానికి ఇంత కష్టపడ నవసరంలేదు. నా పరమ గురువైన శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి గారూ, గురువైన శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారూ, నేనైన లతనూ భరించిన కీర్తి గోపాలరెడ్డిగారికి దక్కుతుంది. ఆ మాటకొస్తే పరమేష్ఠి గురువైన చర్ల బ్రహ్మయ్య శాస్త్రిగారిని కూడా వా రెరుగుదురేమో! గోపాలరెడ్డిగారి శ్రీచరణ కమలాలకు నమోస్కార్.

— లత